# మిరప రైతులు ఆందోళన చెందొద్దు.. విత్తనాలు మొలకెత్తుతాయి: ఆర్కే సీడ్స్ యజమాని రాజు

**పరకాల, జులై 26(పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణంలోని జయ డీలక్స్ రోడ్డులో ఉన్న ఆర్కే సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో ఈ నెల డీఎస్పీఎల్ కంపెనీకి చెందిన దామిని541 మిరప విత్తనాలను కొనుగోలు చేసిన కొంతమంది రైతులు, విత్తనాలు ఇంకా మొలకెత్తకపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై దుకాణ యజమాని తాళ్లపల్లి రాజు స్పందిస్తూ రైతులు ఎలాంటి అపోహలకు గురికావద్దని కోరారు. వాతావరణ పరిస్థితులు, నేల తేమ తదితర కారణాల వల్ల మొలకలో స్వల్ప ఆలస్యం జరిగే అవకాశం ఉందని తెలిపారు. మరో పది రోజుల్లో విత్తనాలు పూర్తిస్థాయిలో మొలకెత్తే అవకాశముందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.




# బీజేపీ ముందుగా ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్,జూలై26(పీసీడబ్ల్యూ న్యూస్):** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ముందుగా ప్రజలకు కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఒక్కరోజులో ఏర్పడిన సమస్య కాదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే భారీగా పేరుకుపోయిన వారసత్వ సమస్య అని మంత్రి పేర్కొన్నారు. ఆ సమయంలో విద్యార్థుల బకాయిల విషయంలో రామచంద్రరావు ఎందుకు మౌనం వహించారో రాష్ట్ర ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు.ప్రస్తుతం ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ, దేశంలో తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎక్కడ ఈ పథకాన్ని అమలు చేస్తోందో స్పష్టం చేయాలని సవాల్ విసిరారు. విద్యార్థుల సంక్షేమంపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని



అమలు చేయడంతో పాటు రాష్ట్రాలపై ఉన్న ఆర్థిక భారాన్ని పంచుకుంటూ కేంద్ర నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువత రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచే ఉద్దేశంతో ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయోపరిమితిని 21 సంవత్సరాలకు తగ్గించాలని ప్రతిపాదించారని, ఆ అంశంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని మంత్రి తెలిపారు. ఆ ప్రతిపాదనపై స్పందించకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకే బీజేపీ ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకుంటోందని విమర్శించారు.ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే వయోపరిమితిని 21 సంవత్సరాలకు తగ్గించే ప్రతిపాదనకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ఇస్తుందా? లేదా? అనే విషయాన్ని రామచంద్రరావు స్పష్టం చేయాలని మంత్రి డిమాండ్ చేశారు.విద్యార్థి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలన్నది కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన విధానమని పేర్కొన్న మంత్రి, ఈ అంశంపై బీజేపీ తన వైఖరిని వెల్లడించాలని కోరారు. విద్యార్థి సంఘాల ఎన్నికలకు మద్దతు ఇస్తుందా? లేదా వ్యతిరేకిస్తుందా? అనే విషయాన్ని రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలని అన్నారు. చివరగా, పరీక్షా పేపర్ల లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టిన బీజేపీకి విద్యార్థుల సంక్షేమంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే కనీస నైతిక అర్హత లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విమర్శలు చేశారు.

# మున్నూరు కాపు, పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో బోనాల వేడుకల్లో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ జిల్లా జూలై 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని చింతకుంట, రాంనగర్, కిసాన్ నగర్, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో, అలాగే మార్కండేయ నగర్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన పోచమ్మ, పెద్దమ్మతల్లి బోనాల మహోత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన మేయర్ శ్రీనివాస్ గారు రాష్ట్రంలో, జిల్లాలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో జీవించాలని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం భక్తులతో కలిసి బోనాల ఊరేగింపులో పాల్గొని



అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే బోనాల పండుగ ప్రజల ఐక్యతకు, భక్తి భావానికి నిదర్శనమని అన్నారు. ఇలాంటి సాంప్రదాయ పండుగలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అమ్మవారి కరుణాకటాక్షాలతో కరీంనగర్ నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గాజరామ శివరాం, తెల్ల లక్ష్మీ రమేష్, బండ రమణారెడ్డి, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, గడ్డి ప్రదీప్, భారీ అపర్ణ జితేందర్, వైద్యుల అంజన్ కుమార్, మల్లికార్జున రాజేందర్, మాజీ కార్పొరేటర్లు ఎడ్ల సరిత అశోక్, చల్ల స్వరూప రాణి హరి శంకర్, మున్నూరు కాపు సంఘం, పద్మశాలి సంఘం ప్రతినిధులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్టీసీని ప్రభుత్వంలో పూర్తిగా విలీనం చేయాలి



## - టీజీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్

**సత్తుపల్లి, జూలై 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** టీజీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ సత్తుపల్లి డిపో జనరల్ బాడీ సమావేశం ఆదివారం డిపోలో ఘనంగా నిర్వహించారు. డిపో అధ్యక్షులు రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జి.ఎస్. నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)ని పూర్తిస్థాయిలో ప్రభుత్వంలో విలీనం చేసి, ఉద్యోగుల



సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా కార్యదర్శి పిల్లి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. 2017, 2021 పీఆర్సీలకు సంబంధించిన బకాయి అలవెన్సులను తక్షణమే ప్రకటించి చెల్లించాలని, కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాల్లో చేరిన కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ డిపో అడ్‌హాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. **కొత్త కమిటీ ఎన్నిక** గౌరవ అధ్యక్షులుగా దండు ఆదినారాయణఅధ్యక్షుడు రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ డి. కృష్ణ,చైర్మన్ చెన్నారావు, కార్యదర్శి ఎన్.ఆర్. కృష్ణ,మహిళా కార్యదర్శి జానకి,కోశాధికారి రవిలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు బాలరావు, రఘురాం, రాజేష్, రమాదేవి, మహేశ్వరి తదితరులు పాల్గొని ఉద్యోగుల సమస్యలు, సంస్థ అభివృద్ధిపై చర్చించారు. సమావేశం లో ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం కొనసాగించాలని నాయకులు పిలుపునిచ్చారు.

# తెలంగాణ ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (TGCGTA) హనుమకొండ జిల్లా కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక..



**హనుమకొండ జులై 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (TGCGTA) హనుమకొండ జిల్లా కార్యవర్గ ఎన్నికలు స్నేహపూర్వక, ప్రజాస్వామ్య వాతావరణంలో నిర్వహించబడి, అన్ని పదవులకు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి:జిల్లా అధ్యక్షుడు: శ్రీ ఎం. రవికుమార్. జిల్లా కార్యదర్శి: డా. డి. వెంకన్న.జిల్లా కోశాధికారి: డా. జి. సుహాసిని.జిల్లా ఉపాధ్యక్షుడు: డా. ఎ. అశోక్.స్టేట్ కౌన్సిల్ సభ్యుడు: డా. ఎస్. కిరణ్.ఈ కార్యక్రమంలో TGCG-TA రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. జే. చిన్న, డా. రమేష్ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలియజేసి, సంఘం బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఎన్నికల ప్రక్రియను డా. ఎం.డి. యాకూబ్,లి అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ కామర్స్, ఎన్నికల అధికారిగా పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులు తమపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న జిల్లా సభ్యులందరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, విద్యా ప్రమాణాల అభివృద్ధి, సంఘ బలోపేతం కోసం సమిష్టిగా కృషి చేస్తామని వారు తెలిపారు.

# మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన నాయకులు



**ఏటూరునాగారం, జులై 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 13వ వార్డుకు చెందిన ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందిన ముదురుకోళ్ల ప్రవంతి కుటుంబ సభ్యులను స్థానిక నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, తాటి కృష్ణ, తాడూరి రఘు, కర్ర రవీందర్, 13వ వార్డు సభ్యులు ఆవుల అక్షయ లక్ష్మీనారాయణ, మాజీ 13వ వార్డు సభ్యులు జగన్నాథం నాగసాగర్, యూత్ ప్రెసిడెంట్ బాలకృష్ణ బోగిరి, కార్యకర్తలు చిన్నిపెల్లి నాగరాజు, కందుకూరి నీలకంఠం, గిలి కత్తుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి డివిజన్‌లో మెరుగైన మౌలిక వసతులే లక్ష్యం: మేయర్ కొలగాని శ్రీనివాస్...

## - 2వ, 21వ డివిజన్లలో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన.



**కరీంనగర్,జూలై26(పీసీడబ్ల్యూ న్యూస్):** నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తూ కరీంనగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు.ఆదివారం నగరంలోని 2వ డివిజన్ చంద్రపురి కాలనీ తిలక్‌నగర్లో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ హోదాలో మేయర్ శంకుస్థాపన చేశారు. అనంతరం 21వ డివిజన్ శ్రీరాంనగర్ కాలనీలో సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రతి డివిజన్‌లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరాభివృద్ధిలో ఎలాంటి రాజీ లేకుండా ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు నగరపాలక సంస్థ నిరంతరం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, 21వ డివిజన్ కార్పొరేటర్ వరాల నర్సింగం, 26వ డివిజన్ కార్పొరేటర్ డా. అంజన్ కుమార్, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' ను వీక్షించిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్..




**కరీంనగర్ జిల్లా జూలై 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమాన్ని కరీంనగర్ రూరల్ మండలం మఖ్దుంపూర్‌లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ తన మన్ కీ బాత్ ప్రసంగంలో దేశ ప్రజలకు అద్భుతమైన దిశానిర్దేశం చేశారని కొనియాడారు. ప్రధానంగా ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో దేశం అన్ని రంగాల్లోనూ స్వయం సమృద్ధి సాధిస్తోందని, దేశ పౌరులు, యువత స్వయంపోషక భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారని తెలిపారు.అలాగే, సైన్స్ మరియు సాంకేతిక రంగంలో దేశం సాధిస్తున్న విజయాలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. విక్రమ్ పరీక్షల విజయవంతం వంటి చారిత్రాత్మక విజయాలు దేశ సాంకేతిక సత్తాను ప్రపంచానికి చాటిచెప్పాయని, శాస్త్ర సాంకేతిక రంగాలలో భారత్ అగ్రగామిగా ఎదుగుతోందని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. దేశ ప్రగతి కోసం ప్రధాని మోదీ చేపడుతున్న సంస్కరణలను ప్రతి ఒక్కరూ స్వాగతించాలని కోరారు. కార్గిల్ దివస్ సందర్భంగా వీరమరణం పొందిన జవానులకు నివాళులర్పిస్తున్నట్లు చెప్పారు.

# తరాలు మారినా తరుగని అనుబంధం..

- 18 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు
- గురువులకు ఘన సన్మానం.. పాఠశాల అభివృద్ధికి 20 వేల విరాళం









**ఖమ్మం, ప్రతినిధి జూలై 26 (పిసిడబ్ల్యూ న్యూస్):**కాలం దూరం చేసినా స్నేహబంధం, గురుభక్తి మరువలేదని ఖమ్మం జిల్లా చింతకాని మండలం నేరడ గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు చాటిచెప్పారు. జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 200708 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 18 ఏళ్ల తర్వాత ఆదివారం ఖమ్మం నగరంలోని గొల్లగూడెం ప్రాంతంలోని కావేరీ రిసార్ట్స్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి కృతజ్ఞతాభావం వ్యక్తం చేశారు. అనంతరం తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తోడ్పాటుగా రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. విద్య పూర్తయ్యాక ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర కారణాలతో వివిధ ప్రాంతాలకు వెళ్లిన సహచరులు ఎన్నో ఏళ్ల తర్వాత ఒకేచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. సమ్మేళనం నిర్వహణలో విశేష కృషి చేసిన దూసరి కళ్యాణ్‌ను ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు. పూర్వ విద్యార్థుల ఐక్యత, గురువుల పట్ల గౌరవం, పాఠశాల అభివృద్ధిపై వారి బాధ్యతాభావానికి ఈ కార్యక్రమం ఆదర్శంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

# బోనాల మహోత్సవం ఘనంగా నిర్వహించిన తోట రామారావు కుటుంబం





**ఖమ్మం, ప్రతినిధి జూలై 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం నగరంలోని 48వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ తోట రామారావుగోవిందమ్మ కుటుంబం ఆధ్వర్యంలో బోనాల మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. యువ మాస్ లీడర్ తోట రమేష్, మెగా మాస్ నాయకుడు తోట రామారావు ఆధ్వర్యంలో టీఆర్ఆర్ కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పుల నాదం, పోతురాజుల విన్యాసాలు, భక్తుల జైజైధ్వానాలు, సంప్రదాయ ఆచారాలు, మొక్కుల నిర్వహణతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. వందలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. భక్తి, సంప్రదాయం, ఐక్యతకు ప్రతీకగా ఈ బోనాల వేడుక విజయవంతంగా సాగింది. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, రాష్ట్ర నాయకులు పొదిల రవికుమార్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం, జిల్లా కార్యదర్శి పసుపులేటి దేవేందర్, జిల్లా మాజీ అధ్యక్షులు, ప్రముఖ వ్యాపారవేత్త పారా నాగేశ్వరరావు, మున్నూరుకాపు నాయకులు జి.వి.వి.ఎల్. నరసింహరావు, కాసిన్ని శ్రీనివాసరావు, సూదా నరసింహరావు, తీగల విజయ్, ముత్యం ఉప్పల్‌రావు, రాపర్తి రాజా, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్న అనంతరం, టీఆర్ఆర్ కుటుంబ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావడంతో బోనాల మహోత్సవం భక్తి పారవశ్యంతో పాటు సామాజిక ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది.

# ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్" కార్యక్రమాన్ని వీక్షించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ జిల్లా జూలై 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని 23వ డివిజన్ సీతారాంపూర్ సూర్యనగర్ కాలనీలో 61వ బూత్ అధ్యక్షుడు కాల్వల జితేందర్ రెడ్డి నివాసంలో నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్" కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతి నెల నిర్వహించే "మన్ కీ బాత్" కార్యక్రమం ద్వారా దేశ ప్రజలతో ప్రత్యక్షంగా సంభాషిస్తూ, దేశాభివృద్ధి, సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణ, యువత పాత్ర, స్వచ్ఛ భారత్, ఆత్మనిర్భర్ భారత్ వంటి అనేక అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని వీక్షించి అందులోని సందేశాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నార్త్ జోన్ అధ్యక్షుడు పాదం శివరాజ్, బూత్ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, చొల్లేటి యుగేందర్ రెడ్డి, కొత్త సతీష్ రెడ్డి, రాజిరెడ్డి, మోహన్, వెలిచాల రవీంద్ర, ద్యావ సత్యనారాయణ, గోపాల్ చారి, సంతోష్ కుమార్, హర్షవర్ధన్, దాడి పవన్ తో పాటు అధిక సంఖ్యలో డివిజన్ వాసులు పాల్గొన్నారు.



# పల్లె ప్రజల ప్రాణరక్షకులకు న్యాయం చేయాలి









## గ్రామీణ వైద్యుల సంక్షేమమే గ్రామీణ ఆరోగ్య వ్యవస్థకు బలమైన పునాది

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేసి గ్రామీణ వైద్యులకు చట్టబద్ధ గుర్తింపు కల్పించాలి

## రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్ విజ్ఞప్తి

**ఖమ్మం ప్రతినిధి, జూలై 26 (పీసీడబ్ల్యూ న్యూస్) :** గ్రామీణ ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటూ అత్యవసర సమయంలో తొలి వైద్యసేవలు అందించే గ్రామీణ వైద్యులు గ్రామీణ ఆరోగ్య వ్యవస్థకు వెన్నెముకలని, అలాంటి సేవామూర్తుల సంక్షేమాన్ని విస్మరించడం బాధాకరమని తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి, వారికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం జిల్లా, బోనకల్ మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామీణ వైద్యుల శిక్షణ తరగతులను రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సేవలను నిరంతరం అందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడుతున్న గ్రామీణ వైద్యుల సేవలు సమాజానికి ఎంతో విలువైనవని అన్నారు. వారి సేవలకు తగిన గౌరవం, భద్రత, చట్టబద్ధ గుర్తింపు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జీఓ 428 ద్వారా గ్రామీణ వైద్యులకు శిక్షణ కల్పించిన విషయాన్ని గుర్తు చేసిన ఆయన, ప్రస్తుతం ఆ ఉత్తర్వును పునరుద్ధరించి మరోసారి శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ గ్రామీణ వైద్యులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు. గ్రామీణ వైద్యులపై జరుగుతున్న వేధింపులు, అక్రమ కేసులు, దాడులను పూర్తిగా నిలిపివేసి వారికి భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామీణ వైద్యుల సంక్షేమానికి ప్రత్యేక విధానాన్ని రూపొందించి, సంఘం ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు ప్రారంభించాలని కోరారు. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థలో వారికి తగిన స్థానం కల్పించడం ద్వారా పల్లె ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలకు అవసరమైన సమయంలో ముందుగా స్పందిస్తూ, పల్లె ప్రజల ఆరోగ్య భద్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న గ్రామీణ వైద్యుల సేవలను సమాజం గౌరవించాలని, వారి సేవలకు ప్రభుత్వ పరంగా తగిన గుర్తింపు లభించడం ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతానికి దోహదపడుతుందని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి నరసింహారావు, రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నవరపు నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నారోపోగు వీరభద్రం, జిల్లా అధ్యక్షులు మద్రి నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు చాపలమడుగు నాగేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షులు శీలం బాలకృష్ణరెడ్డి, జిల్లా న్యాయ సలహాదారులు కాకాటి కరుణాకర్, జిల్లా సాంస్కృతిక అధ్యక్షులు తుప్పాతి శ్రీనివాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మారుతి సంపత్, జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంపల్లి సురేష్, మండల అధ్యక్షులు గుర్రం సురేష్, మండల ఉపాధ్యక్షులు మాతంగి రామ్ కిరణ్, ప్రధాన కార్యదర్శి ఘట్టం వంశీ, కార్యవర్గ సభ్యులు మరీదు వినయ్, గౌరవాధ్యక్షులు మణిరాజ్, సభ్యులు గోపి, ఏసుపోగు డేవిడ్, పండు, పరుశురాం, రామకృష్ణతో పాటు వివిధ మండలాల నాయకులు బత్తుల రాజ్‌కుమార్, ఆర్.వి.బి. చారీ, కొరకొప్పు వెంకటేష్, దోర్నాల లోకేష్, కోట నరేష్, చక్రి పాల్గొన్నారు.

# మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం..

## ఇద్దరు అస్సాం యువకులను కుటుంబ సభ్యులకు చేర్చిన అన్నం సేవా ఫౌండేషన్

## మానవసేవే మాధవసేవ అనే స్ఫూర్తితో అన్నం శ్రీనివాసరావు సేవలు ప్రశంసనీయం..

## సహకరించిన ఖమ్మం టూ టౌన్ పోలీసులకు కృతజ్ఞతలు




**ఖమ్మం ప్రతినిధి, జూలై 26 (పీసీడబ్ల్యూ న్యూస్) :** సరిహద్దులు వేరైనా మానవత్వానికి హద్దులు ఉండవని మరోసారి నిరూపిస్తూ, మతిస్థిమితం కోల్పోయి స్వస్థలాలకు దూరమైన ఇద్దరు అస్సాం రాష్ట్ర యువకులను వారి కుటుంబ సభ్యుల చెంతకు క్షేమంగా చేర్చడంలో అన్నం సేవా ఫౌండేషన్ మరో మానవీయ ఘట్టాన్ని ఆవిష్కరించింది. ఆపదలో ఉన్నవారికి ఆశ్రయం కల్పించి, వైద్యసేవలు అందించి, వారి కుటుంబాలను గుర్తించి తిరిగి కలిపిన ఈ సేవా కార్యక్రమం ప్రతి ఒక్కరినీ హృదయాన్ని హత్తుకునేలా చేసింది. గత ఏప్రిల్ 23వ తేదీ తెల్లవారుజామున బోనకల్ గ్రామంలో మతిస్థిమితం కోల్పోయి సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న సుమారు 30 ఏళ్ల యువకుడిని గ్రామ సర్పంచ్, గ్రామస్తులు అదుపులోకి తీసుకుని బోనకల్ పోలీసులకు అప్పగించారు. అనంతరం అతడిని సంరక్షణ కోసం ఖమ్మంలోని అన్నం సేవా ఫౌండేషన్‌కు తరలించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యం అందించడంతో కోలుకున్న అతడు తన పేరు నికులాష్ సూరిన్ అని, అస్సాం రాష్ట్రం సోనిత్‌పూర్ జిల్లా తేజ్‌పూర్ డివిజన్‌లోని ఖరీజా గ్రామానికి చెందినవాడినని వివరాలు తెలిపాడు. అలాగే జూన్ 19న అస్సాం రాష్ట్రం ధరంగ్ జిల్లా టాంగ్నిర్ఝర్ గ్రామానికి చెందిన సంజయ్ ముండ (21) ఖమ్మంలో మతిస్థిమితం కోల్పోయి అనుమానాస్పదంగా తిరుగుతుండగా డయల్-100 ద్వారా సమాచారం అందుకున్న ఖమ్మం టూ టౌన్ పోలీసులు వెంటనే స్పందించి అతడిని అన్నం సేవా ఫౌండేషన్‌లో చేర్పించారు. అక్కడ అతనికి అవసరమైన సంరక్షణ, వైద్యసేవలు అందించారు. అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటర్నెట్ ద్వారా ఇద్దరు యువకుల కుటుంబ సభ్యుల వివరాలను గుర్తించి వారికి సమాచారం అందించారు. దీంతో ఆదివారం అస్సాం నుంచి నికులాష్ సూరిన్ సోదరి మాలతి సూరిన్, సంజయ్ ముండ సోదరుడు లక్ష్మీధర్ ఖమ్మానికి చేరుకున్నారు. ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రఫీ సమక్షంలో ఇద్దరు యువకులను వారి కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుకు, ఖమ్మం టూ టౌన్ పోలీసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తమ ఆప్తులను తిరిగి తమ చెంతకు చేర్చిన ఈ సేవ జీవితాంతం మరువలేమని భావోద్వేగానికి గురయ్యారు. మానవసేవే మాధవసేవ అనే మహోన్నత భావనతో అనాథలు, నిరాశ్రయులు, మతిస్థిమితం కోల్పోయిన వారికి ఆశ్రయం కల్పిస్తూ, వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్న అన్నం శ్రీనివాసరావు సేవలు నిజంగా అభినందనీయమని పలువురు కొనియాడారు. అదేవిధంగా బాధలో ఉన్నవారికి వెంటనే స్పందించి మానవత్వాన్ని చాటుతున్న ఖమ్మం టూ టౌన్ పోలీసుల సేవలు కూడా ప్రజల ప్రశంసలు అందుకుంటున్నాయి. ఈ కార్యక్రమంలో అన్నం సేవా ఫౌండేషన్ ప్రతినిధులు, ఖమ్మం టూ టౌన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మానవత్వం, సేవాభావం, పోలీసుల బాధ్యతాయుత స్పందన కలిసొస్తే ఎలాంటి కుటుంబమైనా మళ్లీ సంతోషాన్ని పొందగలదని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది.

# పేదలకు బసవతారకం హాస్పిటల్ అండ: మంత్రి కందుల దుర్గేష్

**నిడదవోలు జూలై 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రపంచస్థాయి క్యాన్సర్ వైద్యం అందిస్తున్న బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ నిజమైన గుండె ధైర్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు రూరల్ మండలం సమిశ్రగూడెంలో బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని ఆయన సందర్శించి వైద్య సదుపాయాలను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా బాధితులపై ఆర్థిక, మానసిక భారం తగ్గుతుందని మంత్రి తెలిపారు. డిజిటల్ మామోగ్రఫీ, అల్ట్రాసౌండ్, డిజిటల్ ఎక్స్-రే వంటి ఆధునిక పరికరాలతో కూడిన మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సుల ద్వారా గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు, వైద్య బృందం, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



